
ఈనాడు
కర్నూలు
సోమవారం అక్టోబరు 7, 2024

అక్రమాలు.. ఇసుకేస్తే రాలనంత

■ రవాణా ఛార్జీల పేరుతో వాహన యజమానుల దోపిడీ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ రంగంలో వేగం పుంజుకుంది. ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో కార్మికులకు చేతినిండా పని లభించింది. ఇంతవరకు బాగానే ఉన్నా కొందరు అక్రమార్కులు వినియోగదారుల అవతారమెత్తారు. ఇసుకను తరలించే వాహనదారులే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని ట్రాక్టరు ఇసుకను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. రూ.1,500 ఇసుకకు.. రవాణా భారం మూడింతలు.. రూ.4500 వరకు భారం పడుతోంది. రవాణా ఛార్జీలే ఎక్కువవుతున్నాయని వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. దూరభారం పేరుతో అధిక ధరలకు ఇసుక విక్రయాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు.

● ఇసుక వాహనదారులు దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి 6 వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :

వేధిస్తున్న సర్వర్ సమస్యలు

ఇసుక అవసరార్థులు ఆన్‌లైన్‌లో ఇసుకను బుకింగ్ చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లో ఎక్కువ బుకింగ్ జరగాల్సి ఉండగా సర్వర్ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. ఆఫ్‌లైన్‌లో లక్షన్నర టన్నులకు పైగా విక్రయాలు జరగ్గా.. ఆన్‌లైన్ విధానంలో లోపాలు, సాంకేతిక సమస్యలతో ఇసుక నమోదు పడిపోయింది.. గత నెల 19 నుంచి ఇప్పటివరకు పరిశీలిస్తే 3,544 వాహనాలకు 60,548 టన్నుల ఇసుకకు బుకింగ్ జరిగింది. కానీ 3,196 వాహనాలకు 56,582 టన్నులకుపైగా ఇసుక పంపిణీ జరిగింది. గతంలో ఆరు వేల మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా.. ప్రస్తుతం 2 వేల మంది కంటే తక్కువగానే బుకింగ్ చేసుకుంటున్నారు.

వినియోగదారుల అవతారమెత్తి..

ఆన్‌లైన్ విధానం ప్రారంభమైనప్పటి నుంచి అక్రమార్కులు చొరబడ్డారు. ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులే ఆన్‌లైన్‌లో ఇసుక కోసం బుకింగ్ చేసుకొని సి.బెళగల్ ఇసుక డిపోల నుంచి కర్నూలు, ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 18 టన్నుల ఇసుక టిప్పరు రూ.18-20 వేలకు పైబడి ధర పలుకుతోంది. అంటే టన్ను రూ.1,000 ఉంది. ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.320 నిర్ణయించగా.. రవాణా ఛార్జీలే టన్నుకు రూ.680కు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఇసుక కంటే రవాణాకే రెట్టింపు ఛార్జీలు భరించాల్సి వస్తోంది. ఓ టిప్పరు యజమాని 18 టన్నుల ఇసుకను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని గడివేములలో రూ.26 వేలకు అమ్మినట్లు సమాచారం. ఇలా కొందరు టిప్పర్ల యజమానులు ఇసుకను వారే బుకింగ్ చేసుకొని కర్నూలుతోపాటు ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, నంద్యాల తదితర ప్రాంతాలకు అధిక ధరలకు సరఫరా చేస్తున్నారు.

వినియోగదారులు ఇసుకను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే ఆ రసీదులను తీసుకొని సి.బెళగల్ రీచ్‌ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి. బుకింగ్ చేసుకున్న రెండు రోజులకు ఇసుక చేరుతోంది. ఇసుక నమోదు చేసుకొని.. వాహనం సమకూర్చుకొని.. రీచ్ వద్దకెళ్లి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఇసుక డిపోల్లో ఇసుక అందుబాటులో ఉంచితే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

ఐదింటిలో తవ్వకాలు

ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్దొడ్డి గ్రామాల్లో డీసిల్టింగ్ పాయింట్లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ఐదింటిలో డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తవ్వి నది గట్టున ఇసుక నిల్వ ఉంచుతున్నారు. మొత్తం 3,87,495 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉండగా ఇప్పటి వరకు 2.13 లక్షల మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయి. ఆ ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో ఇంకనూ 1.73 లక్షల టన్నుల ఇసుక లభ్యత ఉంది.

● సి.బెళగల్ మండలంలో ఆఫ్‌లైన్‌లో రోజుకు ఐదారు వేల బుకింగ్‌లు జరగడం గమనార్హం. ఆఫ్‌లైన్‌లో సెప్టెంబరు 18 వరకు 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయి.

భవిష్యత్తు అవసరాల నేపథ్యంలో..

● భవిష్యత్తు అవసరాల నిమిత్తం జిల్లాలోని నాలుగు ఇసుక రీచ్‌లను గుర్తించారు. మరళి-1 ఇసుక రీచ్ 16వ తేదీన అందుబాటులోకి రానుంది. ఈ రీచ్‌లో 72,735 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి.

● మరళి-2, గుడికంబాలి, నదిచాగి రీచ్‌లకు ఈనెల 15న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉంది. రోజుకు 4-5 వేల టన్నుల ఇసుక సామర్థ్యంతో 2025 జనవరి వరకు ఇక్కడ ఇసుక తవ్వకాలకు అనుమతులున్నాయి.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

■ తడిసిపోయిన వేరుశనగ దిగుబడులు


వర్షంలో తడిసిన వేరుశనగ బస్తాలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే : అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రూ.లక్షలు వెచ్చించి పెట్టుబడులు పెట్టగా వర్షంలో తడిసిపోవడంతో ఆవేదనలో మునిగిపోయారు. నియోజకవర్గ పరిధిలో పలువురు రైతులు వేరుశనగ దిగుబడులను ఎమ్మిగనూరులోని వ్యవసాయ విపణికి తీసుకొచ్చారు. 12,794 వేరుశనగ బస్తాలను రైతులు విక్రయానికి తెచ్చారు..

వాతావరణం మారిపోయి..


ఆదివారం ఉదయం నుంచి ఎండ బాగా ఉండగా.. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మబ్బులు కమ్మి వర్షం కురిసింది. అప్పటికే అప్రమత్తమైన రైతులు, విపణి అధికారులు దిగుబడులపై టార్పాలిన్లు కప్పారు. పట్టలు సరిపోకపోవడంతో చాలా బస్తాలు తడిసిపోయాయి. ఆదివారం సంత కావడంతో మార్కెట్‌కు అధికంగా వేరుశనగ దిగుబడులను రైతులు అమ్మకానికి తెచ్చారు. వర్షాల నేపథ్యంలో యార్డులోని షెడ్లలో దిగుబడులను అధికారులు టెండరుకు వేయించారు. స్థలం సరిపోకపోవడంతో కొందరు ప్లాట్‌ఫాంపై దిగుబడులు కుప్పగా పోసి టెండర్‌కు పెట్టారు. వ్యాపారులు ప్లాట్‌ఫాంపై ఉన్న దిగుబడులను తీసుకోకుండా షెడ్లలో ఉన్న సరకును తీసుకున్నారు. వ్యాపారుల తీరుతో పలువురు రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో విపణి అధికారులు స్పందించి అన్నదాతలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

మధ్యంతర భృతి చెల్లించాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి కోరారు. నగరంలోని సలాంఖాన్ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలు చేయడంలో ఆలస్యం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే జీవో 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్ అమలు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందనాయక్, దేవదాసు, శేఖర్, ముర్తుజావలీ పాల్గొన్నారు.

కైలాస వాహనంపై శ్రీశైల మల్లన్న


ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకొస్తున్న శ్రీశైలం ఈవో, అధికారులు


ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన




మహానందిలో గ్రామోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో దసరా ఉత్సవాలు నేత్రశోభితంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారు భక్తులకు కూష్మాండదుర్గగా సాక్షాత్కరించారు. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై కూష్మాండదుర్గ అష్టభుజదేవిగా కొలువుదీరారు. అమ్మవారి నామస్మరణలను కీర్తించిన అర్చకులు కుంకుమార్చన, పుష్పార్చనలు నిర్వహించారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులు కైలాస వాహనంపై కొలువుదీరారు. ఉభయ దేవాలయాల అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవానికి తీసుకొచ్చారు. ఈవో డి.పెద్దిరాజు దంపతులు నారికేళాలు, మంగళహారతులు సమర్పించారు. అనంతరం ప్రధాన పురవీధుల్లో కైలాస వాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఉత్సవాల్లో నేడు : దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారు భక్తులకు స్కందమాతగా దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు శేష వాహనసేవ నిర్వహిస్తారు.

మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మద్యం అనుమతులకు దరఖాస్తుల నమోదు ప్రక్రియ పుంజుకుంటోంది. మొదట్లో ఆఫ్‌లైన్‌లో ఆశించినస్థాయిలో దరఖాస్తులు రాలేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 204 దుకాణాలకు సంబంధించి ఆఫ్‌లైన్ ద్వారా 519 దరఖాస్తులు వచ్చాయి. ఆదివారం ఒక్క రోజే 48 మంది దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో 99 దుకాణాలకు 302 దరఖాస్తులు, నంద్యాల జిల్లాకు 217 దరఖాస్తులు అందాయి. కర్నూలు జిల్లాలో 19, నంద్యాల జిల్లాలో 31 దుకాణాలకు ఆఫ్‌లైన్ ద్వారా ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ఆన్‌లైన్ ద్వారా వచ్చి ఉండొచ్చని ఆబ్కారీ శాఖ అధికారులు భావిస్తున్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది.. కాగా దాదాపు అన్ని దుకాణాలకు దరఖాస్తులు వస్తాయని మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంమీద రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తుల ద్వారానే రూ.కోట్లలో ఆదాయం సమకూరనుంది.


లోపలి పేజీల్లో
వేదవతి ఉగ్రరూపం
జోగులాంబకు పట్టువస్త్రాలు 10

అవినీతి కథ కంచికే!

■ అధ్వానంగా అనిశా పనితీరు

■ 9 నెలల్లో 3 కేసులే..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే



రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను అడ్డుకోవడంలో అవినీతి నిరోధక శాఖ పాత్ర కీలకం. ఆ శాఖ అధికారులు నిరంతరం నిఘా ఉంచి అవినీతిపరుల భరతం పట్టేవారు. పక్కా వ్యూహం రచించి తప్పించుకోకుండా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించేవారు. అంతటి కీలకమైన కర్నూలు రేంజి అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో డీఎస్పీ స్థానం దాదాపు ఐదు నెలలుగా ఖాళీగా ఉంది. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి అనిశా కార్యాలయం కర్నూలులోనే ఉంది. ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, సిబ్బంది ఉంటారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులపై వచ్చే ఫిర్యాదులు స్వీకరించి పకడ్బందీ వ్యూహం రచించడం.. ఆదాయానికి మించి ఆస్తులున్న వారి వివరాలు సేకరించి దాడులు చేయడం వంటివి డీఎస్పీ ఆధ్వర్యంలోనే జరుగుతాయి.

నాటి మంత్రి నిర్వాకంతోనే..

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ మంత్రి పెత్తనం చెలాయించారు. డీజీపీ.. ఆయన బంధువు, సన్నిహితుడు కావటంతో ఇష్టానుసారంగా వ్యవహరించారు. చివరికి అవినీతి నిరోధక శాఖను సైతం వదలిపెట్టకుండా జోక్యం చేసుకున్నారు. కర్నూలు అనిశా డీఎస్పీగా ఉన్న శివనారాయణ స్వామి ఆదోని డీఎస్పీ స్థానానికి బదిలీ అయిన తర్వాత ఆ పోస్టు కొద్ది రోజులు ఖాళీగా ఉండేది. అవినీతి నిరోధక శాఖకు సరిపోయే ఓ డీఎస్పీని నియమించాలని ప్రతిపాదనలు వెళ్లగా సదరు మంత్రి అడ్డుకున్నారు. కొందరు అవినీతి అధికారుల వినతిమేరకు అనిశా డీఎస్పీని నియమించకుండా కుట్ర చేశారన్న ఆరోపణలున్నాయి.

ఎన్నికల నేపథ్యంలో..

సార్వత్రిక ఎన్నికలకు ముందు మే నెలలో కర్నూలు అనిశా డీఎస్పీగా ఉన్న వెంకటాద్రి చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం ఎన్నికలు వచ్చాయి. అప్పటి నుంచి ఈ పోస్టు భర్తీకి నోచుకోలేదు. జిల్లా ఇన్‌ఛార్జి అనిశా డీఎస్పీగా కడప డీఎస్పీ గిరిధర్ వ్యవహరించేవారు. ఎన్నికల తర్వాత ఆయన సైతం మరో విభాగానికి బదిలీ కావడంతో సీఐనే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల అనిశాలో మరో ముగ్గురు సీఐలు మాతృ శాఖకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం కేవలం ముగ్గురు సీఐలు మాత్రమే ఉన్నారు.

పనితీరు మందగించి..

కీలకమైన డీఎస్పీ స్థానం ఖాళీగా ఉండటంతో అనిశా పనితీరు మందగించింది. బాధితులు ఫిర్యాదు చేస్తున్నా స్పందన కానరావడం లేదు. కర్నూలుకు చెందిన ఓ వ్యక్తికి మరో మండలంలో ఉన్న తన పొలానికి సంబంధించి సమస్య రాగా పరిష్కరించుకునేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారిని కలిశారు. ఆయన లంచం డిమాండ్ చేయటంతో భరించలేకపోయారు. అనిశా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. చివరికి డబ్బులిచ్చి పని చేయించుకోవాల్సి వచ్చింది.

కూటమి ప్రభుత్వం వచ్చినా..


ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు పరిశీలిస్తే కర్నూలు అవినీతి నిరోధక శాఖ కేవలం మూడు కేసులు మాత్రమే నమోదు చేయటం గమనార్హం. డీఎస్పీ వెంకటాద్రి బదిలీ అయిన తర్వాత ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీనిని పరిశీలిస్తే అనిశా పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా కీలకమైన అనిశా డీఎస్పీ స్థానం భర్తీ చేయకపోవడం గమనార్హం.

పల్లె మార్గం.. ప్రయాణ యోగ్యం

■ మరమ్మతులకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం

గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ పాలనలో గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రయాణ యోగ్యం కాకుండా మారాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు గ్రామీణులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధ్వానంగా మారిన పంచాయతీరాజ్ రహదారులను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్లకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సేకరించింది. ప్రస్తుతం నిధుల కేటాయింపునకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

నంద్యాల పట్టణం, మహానంది, న్యూస్‌టుడే :



వీటిపై ప్రత్యేక శ్రద్ధ

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పంచాయతీరాజ్ రహదారుల్లో 192 కి.మీ. మేర దారుణంగా దెబ్బతిన్నాయి. వీటిపై 20 కి.మీ. వేగానికి మించి వాహనాలు ప్రయాణించలేని పరిస్థితి. మరో 1,010 కి.మీ. రోడ్లపై 40 కి.మీ. వేగంతో కూడా వెళ్లలేని దుస్థితి. వీటి మరమ్మతులకు నిధులు కేటాయించేందుకు కసరత్తు జరుగుతోంది. ఎన్‌డీబీ, ఏడీబీ, క్లోరనెట్ నిధులతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంజీఎస్‌వై, ఏపీ ఆర్ఆర్‌పీ, నాబార్డు కింద రహదారులపై మరమ్మతులకు అవసరమైన నిధుల వివరాలను ప్రభుత్వం తీసుకుంది.

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా ఉన్న రహదారుల వివరాలు

జిల్లా	20 కి.మీ. వేగం మించి ప్రయాణించలేని రోడ్లు	40 కి.మీ. వేగం మించి ప్రయాణించలేని రోడ్లు
కర్నూలు	114	478
నంద్యాల	78	532

నియోజకవర్గాల వారీగా నివేదికలు

వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో వివిధ పథకాల కింద చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కర్నూలు జిల్లాలోని కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు నియోజకవర్గాల్లో సుమారు రూ.200 కోట్ల విలువ చేసే పనులు ఆగిపోయాయి. వీటికి త్వరలో మరమ్మతులు చేయనున్నారు. నంద్యాల జిల్లాలో శ్రీశైలం, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో సుమారు రూ.150 కోట్ల విలువ చేసే రహదారుల పనులు నిలిచిపోయాయి. వీటిలో అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన రహదారులకు సంబంధించి ప్రభుత్వం ప్రతిపాదనలు తెప్పించుకుంది. కొన్నింటికి ఇప్పటికే పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. ప్రస్తుతం అధికారులు మరమ్మతులు ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం

రహదారుల నిర్వహణకు గత వైకాపా ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వలేదు. కొత్తవి నిర్మించకపోగా.. ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు కూడా చేయించలేని దుస్థితి ఏర్పడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ రహదారులపై దృష్టి సారించింది. ముందుగా రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేని రహదారులపై దృష్టి సారించింది. 20 కి.మీ. కంటే వేగంగా వాహనాలు నడపలేని దుస్థితిలో ఉన్న వాటికి తొలి ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు చేపట్టింది. రెండో ప్రాధాన్యం కింద 40 కిలోమీటర్ల కంటే వేగంగా వాహనాలు నడపలేని రహదారులకు మరమ్మతులు చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి రహదారులను గుర్తించారు.

టెట్‌కు 256 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈవో శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెషన్‌లో 1,699 మందికిగాను 1,526 మంది, మధ్యాహ్న సెషన్‌లో 736 మందికిగాను 653 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు.

బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: దేవరగట్టు బన్ని ఉత్సవం 12వ తేదీ జరగనుందని.. ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి ఆదివారం మాట్లాడారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల ప్రజలు ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవం జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో సోమవారం నుంచి సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాల్లో 24 గ్రామాల ప్రజలు పాల్గొంటారని, ఆయా గ్రామాల్లోని పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ఉత్సవాలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈనెల 12 వరకు నిరంతరాయంగా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ ఏడాది డ్రోన్ ద్వారా నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నడకలో స్నేహబంధం.. మైదానంలో పోటీ తరుణం

◆ రాణిస్తున్న క్రీడాకారిణులు
◆ పలు పోటీల్లో ప్రతిభ



ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: మైదానంలో మొదలైన నడక స్నేహం వైపు సాగింది. తరుణీమణులు ఆరోగ్య శ్రీమంతులుగా మారారు. స్నేహ బంధాలు.. క్రీడా బృందాలుగా మారాయి. నిత్యం సాగించిన సాధన.. పతకాలు సాధించేలా చేసింది. వయసుతో సంబంధం లేకుండా పోటాపోటీగా బరిలో దిగారు.. విజయాల జత కట్టారు. ఆదోని మహిళు క్రీడల్లో ప్రతిభ చాటారు.



పరుగు పోటీల్లో పాల్గొన్న మహిళలు

అలా మొదలైంది..

ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానం మహిళలంతా ఉదయపు నడకకు వెళ్లేవారు. పరిచయాలతో క్రీడాజట్టుగా ఏర్పాటయ్యారు. వీరికి మాస్టర్ అథ్లెటిక్స్ జాతీయ క్రీడాకారిణి ఏలిగే సీమ పరిచయం కావడంతో మైదానంలో వీరి సాధనకు శ్రీకారం చుట్టారు. నచ్చిన ఆటలో మెలకువలు అందిపుచ్చుకున్నారు. ఇదే తరుణంలో ఆదోనిలో ఉమ్మడి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడామీట్ ఉండటంతో సీమ సహకారంతో వీరంతా పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించారు. సుమారు 50 మందికి పైగా మహిళలు ఆదోని నుంచి పోటీల్లో పాల్గొన్నారు. ఆదోని మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29వ తేదీన ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొన్న తొలిసారి పోటీల్లోనే తమ ప్రతిభ కనబరచి పతకాలు అందుకున్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్ర స్థాయి మీట్‌కు సిద్ధమవుతూ రోజు వారీ సాధనను ముమ్మరం చేశారు.

రోజు వారీ వ్యాయామంతో..



నా పేరు సుహాసిని.. వస్త్ర వ్యాపారం చేస్తున్నా. భర్త నాగరాజు వ్యాపారి. మాకు ఇద్దరు పిల్లలు. రోజూ ఉదయం నుంచి తీరిక లేకుండా.. వస్త్ర దుకాణం నిర్వహణతో అలసటగా ఉండేదాన్ని. మైదానంలో చేస్తే ఉపశమనంగా ఉంటుందని పలువురు సలహా ఇచ్చారు. అలా ఉదయం నడకకు వెళ్లడం, వ్యాయామం చేయడంతో జీవనశైలిలో ఎంతో మార్పు వచ్చింది. ఇదే తరుణంలో పోటీల విషయం తెలిసి, పాల్గొన్నా. 800 మీటర్ల పరుగులో బంగారు, డిస్కస్ త్రోలో వెండి, షాట్‌పుట్‌లో బంగారు పతకం అందుకున్నా. ఇలాంటి పోటీలు మనలో ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో దోహదపడుతుంది.

ఉత్సాహం నింపింది



నా పేరు శాంతి. మా వారు బ్రహ్మ వ్యాపారవేత్త. మాకు ఒక అబ్బాయి. నేను గృహిణిగానే ఉండేదాన్ని. కొన్ని సమస్యల కారణంగా వైద్యులను సంప్రదిస్తే.. వ్యాయామం చేయాలని సూచించారు. మైదానంలో అడుగు పెట్టాక.. ఆరోగ్యపరంగా చాలా మార్పులు వచ్చాయి. క్రమం తప్పకుండా క్రీడలు సైతం సాధన చేశారు. మైదానం మిత్రులతో కలిసి పోటీల్లో పాల్గొన్నా. వంద మీటర్ల పరుగు పందెంలో వెండి, డిస్కస్ త్రో, 800 మీటర్ల పరుగు పందెంలో రజత పతకాలు కైవసం చేసుకున్నా. పతకాలు సాధించేంత ప్రతిభ ఉందని ఊహించలేదు.

ఇద్దరం ఉద్యోగులమే..



నా పేరు శిరీష, మా ఆయన నర్సారెడ్డి. ఇద్దరం ఉద్యోగులం. మాకు ఒక అబ్బాయి. చిన్నతనం నుంచే క్రీడలంటే ఆసక్తి. పెళ్లయ్యాక తీరిక లేకపోవడంతో ఇంటి పనులు, ఉద్యోగంతోనే సరిపోయేది. బాబు కాస్త పెద్దవాడు కావడంతో.. ఆరోగ్యానికి కొంత సమయం కేటాయిస్తున్నా. ఆదోనిలో వెటరన్స్ పోటీల్లో వంద మీటర్ల పరుగు, ట్రిపుల్ జంప్‌లో బంగారు, జావలిన్ త్రోలో వెండి పతకాలు అందుకున్నా.

జాతీయ స్థాయిలో రాణించాలని



నా పేరు శ్వేతారెడ్డి. మా ఆయన సురేంద్రరెడ్డి వ్యాపారం. మాకు నలుగురు సంతానం. చిన్నతనంలో పాఠశాల స్థాయిలో ఆటలు ఆడా. ఇంటికి దగ్గరగా మైదానం ఉండటంతో రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయిస్తున్నా. క్రీడా సాధన చేస్తూ.. ఇప్పటి వరకు ఐదు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో, ఏడు సార్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నా. మూడు సార్లు జాతీయ స్థాయిలో, రెండు అంతర్జాతీయ స్థాయి ఆటలు ఆడా. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించాలనేది నా ఆశయం. ఆ దిశగా సాధన చేస్తున్నా..

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వేదవతి



కర్ణాటక సరిహద్దు మార్లమడికి గ్రామం వద్ద ఉద్ధృతంగా వేదవతి నది



పుట్టిలో ప్రమాదకరంగా ప్రయాణం

హొళగుంద, హాలహర్వి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దు మార్లమడికి గ్రామం వద్ద వేదవతి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో వేదవతి హగరికి ఆదివారం భారీగా వరద నీరు చేరింది. నీటి ప్రవాహంతో హగరి పరీవాహక రైతులు తమ పంటలకు ఎంతో ఉపయోగంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. వంతెన మీదుగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువ ప్రాంతాల్లో మళ్లీ భారీగా వర్షాలు కురిస్తే ఆంధ్ర, కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని మార్లమడికి గ్రామస్థులు అన్నారు.

☛ హాలహర్వి మండల పరిధిలో గూళ్యం వద్ద వేదవతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నది దాటేందుకు ప్రమాద పరిస్థితిలో పడవ ప్రయాణం సాగిస్తున్నారు. ఇరు రాష్ట్రాల ప్రజలకు అనువుగా ఉండేలా వంతెన ఏర్పాటు చేయాలని చాలా కాలంగా కోరుతున్నారు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించాలని గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

తమడపల్లె, (మహానంది), న్యూస్‌టుడే: మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశారు. ఆదివారం ఆయన మహానంది మండలం తమడపల్లె గ్రామంలో రైతులు పండించి ఆరబోసిన మొక్కజొన్నను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట చేతికి వచ్చాక సగం ఆదాయం దళారులు, వ్యాపారుల చేతిలోకే వెళ్తోందన్నారు. సెప్టెంబరు మొదటివారంలో క్వింటా రూ.2,950 ఉంటే అది ప్రస్తుతం రూ.2,350 లకు పడిపోయిందని చెప్పారు. నంద్యాల కలెక్టర్ ఎదుట సోమవారం ధర్నా చేస్తున్నట్లు చెప్పారు.

ఆన్‌లైన్‌లో పారదర్శకంగా ఇసుక నమోదు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నూతన ఇసుక విధానం ప్రకారం ఉచితంగా, సులభంగా బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం బుకింగ్ పోర్టల్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ సదుపాయాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇసుక అంశంపై జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా https://www.sand.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో ప్రతి రోజు సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల వరకు ప్రజలకు సరఫరా అవుతోందన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుందని, ఆన్‌లైన్‌లో 6 వేల మెట్రిక్ టన్నుల ద్వారా రోజువారీ బుక్ చేసుకోవచ్చని అక్టోబరు 16 నుంచి కౌతాళం మండలం మరళి-1 ఇసుక రీచ్‌ను మాన్యువల్‌గా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2025 మార్చి వరకు ఇంటికి, ఇతర అవసరాలను తీర్చేందుకు నాలుగు ఓపెన్ రీచ్‌లను గుర్తించామన్నారు. వాటికి అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇసుక పంపిణీ పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ, మైనింగ్, పోలీసు, తదితర శాఖలతో టాస్క్‌ఫోర్స్ బృందాలు, టోల్‌ఫ్రీ నంబరు 1800 425 6042ను కూడా ఏర్పాటు చేశామన్నారు. పంచలింగాల, నాగలదిన్నె ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 5 ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా నీలి లక్ష్మన్నస్వామి

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం పద్మశాలి సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా నీలి లక్ష్మన్నస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదోనిలో ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికలు కార్యనిర్వాహక అధ్యక్షుడు జక్కా వీరేశ్ అధ్యక్షతన జరిగింది. సంఘం అభివృద్ధికి, మార్కండేయస్వామి దేవాలయ అభివృద్ధి కోసం సంఘం సభ్యులందరి సహకారంతో కలిసికట్టుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కోటా రామాంజి, నారాయణమూర్తి, గోవిందరాజులు, హంపయ్య, చిలక శేఖర్, మేడం నాగరాజు, కృష్ణ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మన్నస్వామిని సన్మానించిన సభ్యులు

గోతుల దారిలో.. సాగని ప్రయాణం



ఆదోని పట్టణ శివారు రాయచూర్ రహదారిపై వర్షం నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. నల్లరైల్వేగేటు ప్రాంతం నుంచి వెళ్లే దారిలో మూడు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. లోతుగా ఉండటంతో వర్షం నీరు చేరింది. రహదారి దెబ్బతినడంతో పాటు గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు భయం భయంగా ముందుకెళ్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నా.. ర.భ.శాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

అనిశా డీఎస్పీనంటూ మోసం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: అనిశా డీఎస్పీనంటూ మోసానికి పాల్పడిన ఓ నేరగాడి ఉదంతం కర్నూలులో వెలుగు చూసింది. కర్నూలులోని పాతబస్తీలో విద్యుత్తు శాఖకు చెందిన లైన్‌మెన్ విజయ్‌భాస్కర్‌కు వారం రోజుల కిందట ఓ ఆగంతుకుడు ఫోన్ చేశాడు. తాను అవినీతి నిరోధక శాఖ డీఎస్పీనని, తనకు రూ.లక్ష ఫోన్‌పే చేయాలని బెదిరించాడు. ఇతడు నమ్మి సదరు ఫోన్ నంబరుకు రూ.లక్ష ఫోన్‌పే ద్వారా పంపారు. తర్వాత సదరు ఫోన్ నంబరును వాకబు చేయగా బెంగళూరుకు చెందిన విజ్జుదిగా గుర్తించారు. ఆగంతుకుడు తన తండ్రి ఆసుపత్రిలో ఉన్నాడని, తన బంధువు రూ.లక్ష ఫోన్‌పే చేశారని నమ్మించి నగదును వాడుకున్నట్లు విజ్జు చెప్పాడు. విజయభాస్కర్ ఫిర్యాదు మేరకు కర్నూలు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జోగులాంబకు పట్టువస్త్రాల అందజేత



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో పురేందర్, అర్చకులు, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం స్వామి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తపాలా ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలి

మహానంది, న్యూస్‌టుడే: తపాలా ఉద్యోగులపై ఒత్తిళ్లు తగ్గించాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఏపీ సర్కిల్ కార్యదర్శి వై.మద్దిరెడ్డి డిమాండు చేశారు. ఆదివారం మహానందిలోని ఈశాని కల్యాణ మండపంలో ద్వైవార్షిక సమావేశాన్ని నంద్యాల డివిజన్ సంఘం అధ్యక్షుడు ఎం.జయన్న, కార్యదర్శి ఎస్.జమాల్‌బాషాల సారథ్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మద్దిరెడ్డి మాట్లాడారు. కర్మయోగి, ఆన్‌లైన్‌కోర్సులు చేయాలని ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగిక

☛ నాలుగు డిజిటల్ రిసోర్స్ సెంటర్లకు చర్యలు
☛ విద్యార్థుల సందేహాల నివృత్తికి బోధకుల నియామకం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని పక్కన పెట్టింది. విద్యార్థుల బాగుకు ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. అస్తవ్యస్త విధానాలతో విద్యావ్యవస్థకు గ్రహణం పట్టించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యార్థులకు ప్రయోజనకర విధానాలు తీసుకొస్తోంది. వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ వసతి గృహ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. తొలుత ఎంపిక చేసిన చోట డిజిటల్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేయనుంది. పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా డిజిటల్ సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌ల ద్వారా అందుబాటులో ఉంచనుంది. సొంత భవనాలున్న చోట ఓ గదిని ఆహ్లాదంగా తీర్చిదిద్ది విద్యార్థుల సంఖ్యకు అవసరమైన కుర్చీలను ఏర్పాటు చేస్తూ డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు ద్వారా బోధించనున్నారు. నంద్యాల జిల్లాలో నాలుగు చోట్ల డిజిటల్ రిసోర్స్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



బొమ్మలసత్రంలోని బాలికల ప్రీమెట్రిక్ బీసీ వసతి గృహం

పది మంది పిల్లలుంటే..

బడి నుంచి వచ్చిన తర్వాత వసతిగృహాల్లోని విద్యార్థులకు వివిధ అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు. వివిధ అంశాల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. సులువుగా పాఠ్యాంశాలు తెలుసుకొనేందుకు డిజిటల్ విధానంలో వివరిస్తారు. పదో తరగతి విద్యార్థుల్లో అనుమానాలు నివృత్తి చేయడానికి బోధకులను నియమించారు. పది మంది పిల్లలుంటే గణితం, సైన్స్, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులకు బోధిస్తారు. ఒక్కో బోధకుడికి నెలకు రూ. 1500 చెల్లించాలని నిర్ణయించారు.

నవంబరు 14న ప్రారంభించేలా...!

నంద్యాల జిల్లాలో ప్రీ మెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాలు 33 ఉన్నాయి. ఇందులో 22 ప్రీ మెట్రిక్, 11 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. జిల్లాలోని బీసీ వసతి గృహాలు 28 సొంత భవనాల్లో, అయిదు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 4,264 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. బనగానపల్లె(బాలుర), డోన్(బాలుర), నంద్యాల(బాలికల), నందికొట్కూరు(బాలుర) బీసీ ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో డిజిటల్ రిసోర్సుసెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా వాటిని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం

- ముస్తాక్ అహమ్మద్, జిల్లా బీసీ సంక్షేమాధికారి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో నాలుగు వసతి గృహాల్లో డిజిటల్ రిసోర్సుసెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. దీంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి. అనుమతులు రాగానే ప్రారంభిస్తాం.

కారు బోల్తా : ఒకరి మృతి


ఇటిక్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కకు కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఎర్రవల్లిచౌరస్తా సమీపంలోని విజయవర్ధిని ఆయిల్ మిల్లు ఎదురుగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు బోల్తాపడింది. దీంతో స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్తున్న కర్నూలులోని శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(60) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఆయన ఒక్కరే ఉన్నారు. కర్నూలు జిల్లా పంచలింగాల సమీపంలోని ఆల్కాలిస్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు.

సుంకేసులకు పెరిగిన ఇన్‌ఫ్లో

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఆదివారం ఇన్‌ఫ్లో పెరిగింది. ఎగువన కురిసిన వర్షాలకు 29,150 క్యూసెక్కుల నీరు జలాశయానికి వస్తున్నాయని జలాశయ ఇంజినీరు రాజు తెలిపారు. 6 గేట్లు ఎత్తి 29,139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో 42వ జూనియర్స్ బాలబాలికల జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆయా పోటీలను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ.ఫిరోజ్, గురురాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత డా.దస్తగిరిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, సాఫ్ట్‌బాల్ సంఘ జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ అమ్నాకర్ ప్రారంభించి మాట్లాడారు. నంద్యాలలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. నంద్యాలలో జరిగే పోటీలకు 23 రాష్ట్రాల జట్లు ప్రాతినిధ్యం వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వైఎస్సార్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి, గురురాజ పాఠశాల డైరెక్టర్ మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న చండీఘర్, హరియాణా బాలికల జట్లు

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమహేంద్రవరం డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు 25 పతకాలు సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం సహాయ కార్యదర్శి సుబ్బరత్నాలు, సహాయ కార్యదర్శి ఓబన్న ఆదివారం తెలిపారు. ఇందులో ఐదు స్వర్ణాలు, ఐదు కాంస్య పతకాలు వచ్చాయన్నారు. జిల్లా క్రీడాకారులకు పతకాలు రావడంతో కర్నూలు డీఎస్‌ఏ శిక్షకుడు కాశీరావు, సీనియర్ క్రీడాకారులు బిర్లా శీను అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో సహాయ కార్యదర్శి ఓబన్న



విజేతగా నిలిచిన కర్నూలు జిల్లా క్రీడాకారులు

రగ్బీ విజేత కర్నూలు జిల్లా బాలుర జట్టు

పెదవేగి, న్యూస్‌టుడే: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పెదవేగిలోని గురుకుల బాలుర పాఠశాల మైదానంలో అండర్-19 విభాగంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో కర్నూలు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల నుంచి 144 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.జయరాజు ట్రోఫీలు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయిలో త్వరలో జరిగే పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. పరిశీలకుడు కె.నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, పీఈటీ గురుమూర్తి, వివిధ జిల్లాల పీఈటీలు పాల్గొన్నారు.

ఒక్క ఉద్యోగి.. మూడు పోస్టులు

☛ దృష్టి సారించని అధికారులు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగంలో ఓ ఈఈకి మరో డివిజన్ (ఈఈ స్థాయి) బాధ్యతలు అప్పగించారు. కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో డీఈఈ, ఏఈఈలు బాధ్యతలు చేపట్టారు. కర్నూలు పీఐయూ, ఆదోని పీఆర్‌ఐ పోస్టుల్లో నియమించిన ఈఈలు విధుల్లో చేరలేదు. వీరికి సెప్టెంబరు 22న బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కర్నూలు సర్వశిక్ష ఈఈ రఘురామిరెడ్డిని కీలకమైన కర్నూలు డివిజన్ పీఐయూ ఈఈగా నియమించారు. ఆదోని పీఆర్‌ఐ ఈఈగా డ్వామాలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్‌ను నియమించినా విధుల్లో చేరలేదు. దీంతో వారి స్థానంలో కర్నూలు పీఆర్‌ఐ ఈఈ మద్దన్నకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీ అయిన ఏడు రోజుల్లోనే బాధ్యతలు చేపట్టాలి. మాతృ శాఖ వదిలి మరో శాఖలో (ఫారిన్ సర్వీస్) ఐదేళ్లకుపైగా విధులు నిర్వహించిన ఈఈలు రఘురామిరెడ్డి, వెంకటేశ్‌లు అక్కడినుంచి రిలీవ్ కావడం కష్టంగా మారుతోంది. ఈ మేరకు కొత్తగా వచ్చిన పోస్టింగ్‌లో బాధ్యతలు నిర్వహించేందుకు చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. దీంతో ఒకే ఈఈ మద్దన్న మరో డివిజన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇరువురికి అదనపు బాధ్యతలు

జలవనరుల శాఖలో రెండు సబ్ డివిజన్ల స్థానంలో అదనపు బాధ్యతలు అప్పగించారు. కేసీసీ కర్నూలు డీఈఈ రఘురామిరెడ్డి క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ కావడంతో ఈయన స్థానంలో నంద్యాల డీఈఈ సుబ్రహ్మణ్యంరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కేసీసీ డీఈఈగా ఎవరినీ నియమించలేదు. హంద్రీనీవాకు చెందిన ఓ అధికారి ఇక్కడికి అదనపు బాధ్యతలపై వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈయన గతంలో వైకాపాకు అనుకూలంగా వ్యవహరించగా.. కర్నూలులో ఉండేందుకు ఇప్పుడు అధికార కూటమి నాయకులకు సన్నిహితంగా ఉంటూ కేసీసీ డీఈఈ పోస్టుకు ప్రయత్నిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. ఆ పార్టీ నేతల వెంట తిరుగుతూ కర్నూలులోనే విధులు నిర్వహిస్తుండటంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇరిగేషన్ కర్నూలు ఎంఐ సబ్ డివిజన్ డీఈఈ జిలానీబాషా పత్తికొండకు బదిలీ కావడంతో ఎవరినీ నియమించలేదు. డోన్ సర్వే ఇన్వెస్టిగేషన్ (ఎస్.ఐ.) విభాగం డీఈఈ కిష్టన్నకు కర్నూలు డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన ఇప్పటికే నంద్యాల ఈఈగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఆదోని
• ఆదోని • ఆలూరు • పత్తికొండ

‘ప్రాణభయం ఉంటే పోలీసులను ఆశ్రయించాలి’

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి ప్రాణభయం ఉంటే పోలీసు శాఖ ఉన్నతాధికారులను కలిసి రక్షణ పొందాలని, సామాజిక మాధ్యమంలో ప్రచారం చేయడం వల్ల ప్రయోజనం ఉండదని మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబు పాలనలో మీరు సురక్షితంగా ఉంటారని, కూటమి గెలుపు కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి తరఫున హామీ ఇస్తున్నామన్నారు. ప్రాణభయం ఉంటే పోలీసులను కలవకుండా.. సామాజిక మాధ్యమాల వారిని కలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాయకులు వసీంసాబ్, రామలింగ, నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో వాహనాల తనిఖీ

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని హోసూరు రోడ్డులో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సై గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీలో వాహనాల పత్రాలు సక్రమంగా లేని వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. లైసెన్సులు లేకుండా పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: **సమస్య:** ఆదోని పట్టణంలో గుజరాతీ పాఠశాల ప్రాంతంలో ప్రధాన రహదారిపై మురుగు కాలువలో సిల్టు తొలగింపు పనులు నిలిపివేశారు. దుర్వాసనతో రోగాలబారిన పడుతున్నాం. – మారుతి, ఆదోని

సమాధానం: ప్రజారోగ్య విభాగం ద్వారా సమస్యను దూరం చేస్తాం. – కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

ఆలూరు, న్యూస్‌టుడే: **సమస్య:** ఆలూరులోని అటవీ శాఖ కార్యాలయం సమీపంలో కోయనగర్ వెళ్లే మార్గంలోని రహదారి పక్కన చెత్తా చెదారం పేరుకుపోయింది. వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. పరిసరాలు శుభ్రం చేయించాలని కోరుతున్నాం. – చిన్నా, ఆలూరు

సమాధానం: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వెంటనే పరిసరాలు శుభ్రం చేయిస్తాం. చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలు కూడా సహకరించాలి. – అరుణాదేవి, సర్పంచి, ఆలూరు

ఆదోని ప్రాంత అభివృద్ధికి ఐక్య పోరాటం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: వెనుకబడిన ఆదోని ప్రాంత అభివృద్ధి కోసం ఐక్యంగా ఉదయమించాలని ఆదోని జిల్లా సాధన కమిటీ కన్వీనరు పగడాల కకోదండ, గౌరవ అధ్యక్షుడు దస్తగిరినాయుడు పిలుపునిచ్చారు. ఆదోనిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన ఆదోని రెవెన్యూ డివిజన్‌ను ఆదోని జిల్లాగా ప్రకటించాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రామలింగ, బంగారప్ప, ఉదయ్, షేక్షావలి, రామచంద్ర, పాండురంగ, రవి, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

17న వాల్మీకి జయంతి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండలో ఈ నెల 17న నిర్వహించనున్న వాల్మీకి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు రామాంజనేయులు, సాయిబాబా, సోమశేఖర్ కోరారు. పత్తికొండలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు రవికుమార్, కాశీనాథ్, వెంకట్రాముడు, రమేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం

హాళగుంద, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సుళువాయి గ్రామానికి చెందిన మల్లికార్జున భార్య జ్యోతి అంబులెన్స్‌లో ప్రసవించినట్లు 108 ఈఎమ్‌టీ రంగస్వామి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త వరలక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 108కు సమాచారమిచ్చారు. 108 పైలెట్ నూరుబాషా, సిబ్బంది, సుళువాయి గ్రామానికి వెళ్లి, నిండు గర్భిణిని తీసుకుని హాళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా.. పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎమ్‌టీ రంగస్వామి గర్భిణికి రక్తపోటు పరీక్షించి, వైద్యం చేశారు. సుళువాయి మార్గం మధ్యలోనే జ్యోతి రెండో కాన్పులో ఆడ పిల్లకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు తీసుకుని వెళ్లినట్లు, వారు క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి, ఈఎమ్‌టీ రంగస్వామికి అభినందనలు తెలిపారు.

గుంతల రహదారులు బాగు చేయండి

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆస్పరి నుంచి ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతు రంగస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో గుంతలు ఏర్పడిన రహదారిపైనే ఆదివారం రాస్తారోకో చేపట్టారు. రహదారికి మరమ్మతులు చేయకపోతే దశల వారీగా మండల కేంద్రమైన ఆస్పరిలో ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామంజనేయులు, నాగరాజు, ఈరన్న, ఇబ్రహీం, వీరేష్, సూర్యనారాయణ, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో రోగాల కుంపటి

■ నమోదవుతున్న డెంగీ కేసులు ■ ఆందోళనకు గురిచేస్తున్న పారిశుద్ధ్య లోపం


కాలనీలో అపరిశుభ్ర వాతావరణం

పల్లెల్లో రోజు రోజుకు సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. రోగులను గుర్తించిన తర్వాత ఆ పల్లెల్లో మాత్రమే పారిశుద్ధ్య చర్యలు, గ్రామస్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను వైద్య సిబ్బంది చేపడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య లోపంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దేవనకొండ మండలంలో ఓ చిన్నారికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ గ్రామంలో వైద్య, పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టారు. పలు గ్రామాల పరిస్థితి ఇది.

మండలం	
పంచాయతీలు	
గ్రామాలు	
జనాభా	

పంచాయతీ కార్యాలయం పక్కనే..

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని పంచాయతీ కార్యాలయం పక్కనే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. 20వ వార్డు పరిధిలోని ఎస్వీ సుబ్బారెడ్డి కాలనీలో సుమారు రెండు వేల మందికి పైగా జనాభా నివాసం ఉంటోంది. పనుల నిమిత్తం పత్తికొండకు వచ్చిన వారు మూత్రవిసర్జన చేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. చెత్తాచెదారం వేయడంతో అపరిశుభ్రంగా మారుతోంది. ఇదే దారిలో రోజు విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రదేశానికి కూతవేటు దూరంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, సచివాలయం 1, 2 ఉన్నాయి. అధికారులు కనీసం అటువైపు చూడటం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పట్టణం:	పత్తికొండ
వార్డులు:	20
నివాస గృహాలు:	18 వేలు
జనాభా:	40 వేలు

మురుగులో నడిస్తేనే ఇంట్లోకి...



హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామ పంచాయతీ మజరా గ్రామం బల్లూరులో పారిశుద్ధ్యం లోపించి దోమలు పెరుగుతున్నాయి. ఇళ్ల మధ్యలో ప్రధాన దారిలో మురుగు నిలిచింది. మురుగులో నడిస్తేనే ఇంట్లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లకు ఇరువైపులా ఎక్కడికక్కడే ఎత్తు పెంచడంతో నీరు నేరుగా వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మండలం	హాలహర్వి
పంచాయతీలు	20
గ్రామాలు	24
జనాభా	41,123

ప్రబలుతున్న వ్యాధులు

మద్దికెర, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం కారణంగా దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు రహదారులపై సైతం మురుగు నిలుస్తోంది. మద్దికెరలోని కొండమ్మబావి నుంచి స్థానిక కబేళా వరకు సిమెంటు రహదారి నిర్మించారు. చిన్న కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీరు రోడ్డుపైనే నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ దృష్టికి తీసుకువెళ్లగా.. పరిశీలించి వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా సిబ్బందిని ఆదేశిస్తామన్నారు.

మండలం	మద్దికెర
పంచాయతీలు	08
గ్రామాలు	11
జనాభా	50వేలు



దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హాళగుంద, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దేవరగట్టు కొండ గుహలో వెలసిన మాళమల్లేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే జల, తైలాభిషేకం, బండారు అర్చన, బిల్వదళార్చన, పుష్పాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, అమ్మవారికి కుంకుమార్చన, వస్త్రాలంకరణ, ఆకుపూజ, మహామంగళ హారతి ఆలయ అర్చకులు నిర్వహించారు. దేవరగట్టు బన్ని ఉత్సవాలు ప్రారంభం అవుతుండంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.


అలంకరణలో మాళమల్లేశ్వర స్వామి

వీరశైవ యువకుల రక్తదానం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పేటవీరభద్రేశ్వరస్వామి ఆలయంలో వీరశైవ యువక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని శిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షులు దేవిశెట్టి రవి తెలిపారు. 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేవా సంఘం అధ్యక్షులు విరుపాక్షి స్వామి, సంఘ సభ్యులు శరణ, కౌషిక్, బసవ, మల్లేష్, మణికంఠ, విక్రమ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న వీరశైవ సంఘం యువకులు

ఆర్యవైశ్యుల వైద్యశిబిరం

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉదయం రక్తదాన, ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించినట్లు ఆర్య వైశ్య నాయకులు తెలిపారు. ధారా పవన్ అధ్యక్షత వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్నామని సంఘ అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేష్ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుబ్రమాణ్యం, మిరియా శ్రీధర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు..

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకొందాం

అరికెర(ఆలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: దసర రోజు జరిగే బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. ఆదివారం రాత్రి ఆలూరు మండలం అరికెర గ్రామంలో సర్పంచి నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. అనాదిగా వస్తున్న ఆచారాలను ఆనందంగా అనుసరించాలి తప్ప, హింసకు, వివాదాలకు తావుండరాదన్నారు. కార్యక్రమంలో ఆలూరు సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్సై వెంకట నరసింహులు, ఏఎస్సై చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆలూరు గ్రామీణం: అరికెరలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

హొళగుంద, న్యూస్‌టుడే: దసరా బన్ని ఉత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. మండల పరిధిలోని సుళువాయి గ్రామంలో ఆదివారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేవరగట్టులో డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘాను, పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నామని, ఎవరూ కూడా ఇనుప రింగు తొడిగిన కర్రలను దేవరగట్టుకు తీసుకురావద్దన్నారు. కార్యక్రమంనకు ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, హొళగుంద ఎస్సై బాల నరసింహులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

అలనాటి జ్ఞాపకం.. నేటికీ పదిలం


కే వేదికపై పదో తరగతి పూర్వ విద్యార్థులు

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. నాలుగు పదుల వయసులో చిన్న పిల్లల్లా సందడి చేశారు. ఆ బ్యాచ్‌కు చెందిన 72 మంది దేవనకొండలోని లక్ష్మీరంగ కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు అక్షరాలను నేర్పిన బడిని అభివృద్ధి చేసేందుకు వారంతా సంకల్పించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయులైన శ్రీనివాసులు, హిదాయితుల్లా, నారాయణ, రంగస్వామి, తిమ్మప్ప, శ్రీనువాసులు (వార్డెన్), పద్మజ, రంగస్వామి, రమేష్, భక్త కన్నప్ప ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలోని ఆదోని-ఇస్వీ రైల్వేలైను 496/30-497/2 కి.మీ. వద్ద టి.చంద్రశేఖర్(50) రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సాయిసర్వేశ్వర్‌రావు తెలిపారు. ఆస్పరి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ మతిస్థిమితం సరిగాలేక రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెంది ఉండాలని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెట్టు తొలగింపు విషయంలో ఇరువర్గాల ఘర్షణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం సంతేకూడ్లూరు గ్రామంలో ఆదివారం చెట్టు తొలగింపు విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. గ్రామానికి చెందిన ఈరన్న, భీమేష్ వర్గాల మధ్య గొడవపడి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘర్షణలో గాయాలకు గురైన ఈరన్నతో పాటు మరికొందరు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయమై ఇస్వీ పోలీసులను న్యూస్‌టుడే సంప్రదించగా.. ఇరువర్గాలను విచారిస్తున్నామన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహం

బొజ్జనాయునిపేట(మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామానికి చెందిన ఎల్.ఎస్. ఉషారాణి, విజయభాస్కర్ దంపతుల కుమార్తె చంద్రకళను వీరశైవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, ధ్రువపత్రాలు అందజేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. వీరశైవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులో జరిగిన వీరశైవుల ప్రతిభ పురస్కార మహోత్సవంలో భాగంగా బొజ్జనాయునిపేట గ్రామానికి చెందిన చంద్రకళకు ధ్రుపత్రాలలో పాటు ప్రోత్సాహకాలు అందించారు. గత మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఈ విద్యార్థిని 540 మార్కులు సాధించింది. కార్యక్రమంలో మరో 80 మంది విద్యార్థులకు ఈ ప్రతిభా పురస్కారాలు అందించినట్లు తెలిపారు.


వీరశైవ సంఘం నాయకుల నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న చంద్రకళ

పశ్చిమ తీరాన.. కంకణ ధారణ

✦ ఉత్సవాలు ముగిసే వరకు కఠోర దీక్ష
✦ సంప్రదాయాల అనుసరణలో పల్లెలు

దేవరగట్టు(హొళగుంద, హాలహర్వి), న్యూస్‌టుడే: హొళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాలు ఈ నెల 7వ తేదీన కంకణధారణతో ప్రారంభమవుతాయి. ఉత్సవాల ప్రారంభానికి ముందే దసరా అమావాస్య వస్తుందంటే మండలంలోని నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల భక్తుల్లో నిష్ఠ, నిబద్ధతకు కట్టుబడి ఉంటాయి. దైవ కార్యానికి ఆ మూడు గ్రామాల భక్తులు కులమతాలకు అతీతంగా కఠోర దీక్షకు శ్రీకారం చుడతారు. సుమారు 15 రోజుల పాటు అన్ని సుఖాలు వదులుకుని దైవ కార్యం సాఫీగా ముగిసేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడం ఇక్కడి ఆనవాయితీ. ఆయా గ్రామాల ప్రజలు దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాలకు సిద్ధం అవుతున్నారు.


నెరణికి గ్రామం విహంగ వీక్షణం


నెరణికిలో కొలువైన ఉత్సవమూర్తులు

కఠిన నియమాలతో..

హొళగుంద మండలంలోని నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాలు బన్ని ఉత్సవాల ముందు నుంచి కఠిన నియమాలు పాటిస్తారు. ఆయా గ్రామాల ప్రజలు మద్యం, మాంసం, ఇతర సుఖాలకు దూరంగా ఉండటంతో పాటు కటిక నేలపైనే నిద్రించడం కచ్చితంగా పాటిస్తారు. బన్ని ఉత్సవాలు ముగిసే వరకు గ్రామస్థులెవరూ 15 రోజుల పాటు కాళ్లకు కనీసం చెప్పులు సైతం ధరించరు. నెరణికిలో కొలువై ఉండే స్వామివారి ఉత్సవమూర్తులు దేవరగట్టుకు తరలించడంతో పాటు వాటిని గ్రామానికి చేర్చే వరకు ప్రజలంతా ఈ కట్టుబాట్లు పాటిస్తుండటం వారి భక్తికి ఉదాహరణగా నిలిస్తోంది.

ఆచారాలకు కట్టుబడి నడుచుకుంటాం: – గిరిస్వామి, పురోహితుడు, నెరణికి



దశాబ్దాలుగా పెద్దలు పాటించిన ఆచారాలకు కట్టుబడి మూడు గ్రామాల ప్రజలం నడుచుకుంటున్నాం. బన్ని ఉత్సవాల్లో ఆయా గ్రామాల భక్తులెవరూ కర్రలతో కొట్టుకోరు. ఇతర ప్రాంతాల నుంచి తాగొచ్చిన కొందరి వల్ల అపశ్రుతులు జరుగుతుంటాయి. ఫలితంగా మా మూడు గ్రామాల భక్తులకు చెడ్డ పేరు వస్తోంది. ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు కట్టుబడి ఉంటాం.

పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

ఆలూరు, న్యూస్‌టుడే: పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అనంతపురం కురవ సంఘం నాయకులు అన్నారు. చైనాలో జరిగిన అంతర్జాతీయ సెపక్‌తక్రా పోటీల్లో భారత జట్టు తరపున పాల్గొని సత్తా చాటిన ఆలూరుకు చెందిన మధుతో పాటు తండ్రి బసవరాజును ఆదివారం అనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో సత్కరించారు. మధు మరిన్ని విజయాలు అందుకుని, ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు తీసుకురావాల వారు కోరినట్లు బసవరాజు తెలిపారు.



మధు, తండ్రి బసవరాజును సత్కరిస్తున్న కురవ సంఘం నాయకులు

కష్టం రోడ్డుపాలు



హొళగుంద, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో రైతులు రూ.లక్షల పెట్టుబడితో పత్తి సాగు చేశారు. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతుండడంతో.. చేతికొచ్చిన పత్తి తడుస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన పత్తిని ఆరబెట్టేందుకు స్థలాలు లేక.. పొలాల పక్కనున్న రహదారులపై, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టుకుని ఇంటికి తరలిస్తున్నారు. పత్తి ధరలు ఆశాజనకంగా ఉన్నా.. తడిసిన పత్తికి మార్కెట్‌లో తక్కువ ధరకు తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొగలగల్లు.. గుండె ఝల్లు



ఆస్పరి, న్యూస్‌టుడే: ఇదేదో దసరా పందేలకు ఏర్పాటు చేసిన బురద దారి అనుకుంటే పొరపాటే. ఆస్పరి మండలంలోని తొగలగల్లు గ్రానికి వెళ్లే రహదారి ఇది. ఆస్పరికి వెళ్లాలంటే యాటకల్లు వరకు 4 కి.మీ. మట్టిదారి దాటి వెళ్లాలి. వర్షం వచ్చిన ప్రతిసారి గుంతల్లో నీరు చేరి, బురదగా మారి ప్రమాదకరంగా మారుతుంది. ఈ దారిలో ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాటకల్లు మీదుగా ఆస్పరికి 15 కి.మీ. మాత్రమే అవుతుంది. అధికారులు, పాలకులు ఈ దారిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

గండాల దారిలో.. చెరువు తండా



పత్తికొండ(తుగ్గలి), న్యూస్‌టుడే: గుత్తి- పత్తికొండ ప్రధాన రహదారిలో గవనికొండ నుంచి చెరువుతండా వరకు 12 కిలోమీటర్లు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రహదారిపై ఎక్కడ చూసిన లోతైన గుంతలు ఉండడం వలన వర్షం నీరు గుంతలలో చేరి వాటిని గుర్తించక ఆ మార్గంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈమార్గంలోనే కర్ణాటక నుంచి వెళ్లే ప్రయాణీకులు మంత్రాలయం క్షేత్రానికి వెళుతున్నారు. ప్రయాణీకులతో, సరుకు రవాణా లారీలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏడేళ్ల తర్వాత జలకళ



తుగ్గలి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షానికి జొన్నగిరి చెరువు నిండి మొరవ పారుతోంది. ఏడేళ్ల తరువాత నిండటంతో గ్రామస్థులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నిండడంతో తాగునీటికి, వ్యవసాయ బోర్ల కింద సాగునీటికి ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొంటున్నారు. చెరువు కింద పొలాలు ఉన్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందని సమయంలో ఈ నీరు ఉపయోగపడుతుందన్నారు. చెరువు నిండుకుండలా కనిపిస్తుండటంతో గుత్తి- పత్తికొండ దారిలో వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు


మంగళహారతి ఇస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు భక్తులు సువర్ణ రథం సేవ నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మంత్రాలయం చేరుకొని స్వామి వారి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు భక్తులకు ఫలమంత్ర అక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు భక్తులు వెండి అంబారి, చెక్క, వెండి, బంగారు రథంపై ఉంచి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మంగళహారతి ఇచ్చారు. అనంతర శ్రీమఠం ప్రాకారం చుట్టూ ఊరేగించారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మఠం దివాన్ శ్రీకాంత్ ఆచార్, సహాయ పీఆర్వో బిందుమాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,020

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,020, మధ్యస్థం రూ.5,126, కనిష్ఠం రూ.2,900 వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు రైతులు 12,794 వేరుశనగ బస్తాలను విక్రయానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,870, మధ్యస్థం రూ.5,653, కనిష్ఠం రూ.4,690 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** మండలంలోని కంబళదిన్నె గ్రామంలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతోంది. –గ్రామస్థులు, కంబళదిన్నె

సమాధానం: మండలంలోని కంబళదిన్నెలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం.
–జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

సి.బెళగల్, న్యూసుటుడే: సమస్య: కొత్తకోట ఉన్నత పాఠశాల మైదానంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని తొలగించాలి. **–వెంకటేశ్వర్లు, కొత్తకోట**

సమాధానం: కొత్తకోట ఉన్నత పాఠశాల మైదానంలో పిచ్చి మొక్కలు తొలగిస్తాం. **–డ్వామా ఏపీవో రామన్న, సి.బెళగల్**

సమస్య: సి.బెళగల్‌లో ఉన్నత పాఠశాలకు కొద్ది మేరకు అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణం పూర్తి చేయండి. **–మల్లేశ్వరమ్మ, సి.బెళగల్**

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. **–ఈశ్వరయ్యస్వామి, ఈవోఆర్డీ, సి.బెళగల్**

సమస్య: పోలకల్ గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని నిర్మించాలి. **–రాజన్న, పోలకల్**

సమాధానం: గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం **–ఈశ్వరయ్యస్వామి, ఈవోఆర్డీ, సి.బెళగల్**


కూచిపూడి నృత్యం చేస్తున్న వరంగల్‌కు చెందిన కళాకారులు

రాఘవేంద్రుడికి నృత్య నీరాజనం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కూచిపూడి కళా నృత్యంతో కళాకారులు రాఘవేంద్రుడికి నృత్య నీరాజనం సమర్పించారు. వరంగల్‌కు చెందిన ఎన్‌సీఎన్ కళాక్షేత్రం నిర్వాహకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం నాదన మనె కార్యక్రమం నిర్వహించారు. ప్రవచనా మందిరంలో నిర్వాహకులు పద్మనాభాచార్ ఆధ్వర్యంలో కళాకారులు చందన, హాసిని, భవిష్య, ప్రసన్న, లక్ష్మీ సిద్ధ, చిన్నారులు జియ, మిథున, శ్రీనిధి, దమన్వి తదితరులు కూచిపూడి, విష్ణుకీర్తనలు, గజేంద్రమోక్షం, సీతాస్వయంవరం, ఇతిహాసాల నృత్య రూపకం, కూచిపూడి నృత్య తరంగాలు ప్రదర్శించారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు కళాకారులకు ఫలమంత్ర అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు.

శివారు కాలనీలు.. శుద్ధజలం కరవు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలోని పలు కాలనీల్లో తాగునీటి వసతి లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇళ్లలో బోరు నీటిని, ప్రైవేటు శుద్ధిజల కేంద్రాల నుంచి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ. లక్షల పన్నులు రూపంలో చెల్లిస్తున్నా.. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదు. ఐదేళ్ల వైకాపా పాలనలో పైసా నిధులు కేటాయించక పోగా.. తెచ్చిన నీటి పథకాల పైపులు మూలన పడేశారు.


గుడేకల్లు రోడ్డు వద్ద ఉన్న పంప్‌హౌజ్‌లో వృథాగా పైపులు

సగానికిపైగా కాలనీల్లో పైపులైన్లు లేవు

ఎమ్మిగనూరు పట్టణంలో జనాభా 1.23 లక్షలకు చేరుకుంది. పట్టణ శివారు ప్రాంతాల్లో దాదాపు 13 కాలనీలు అభివృద్ధి చెందాయి. వివిధ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోని ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. వారికి శుద్ధ జలం ఇచ్చేందు పైపులైన్లు మంజూరు చేయలేదు. నీటి కోసం పలుమార్లు వినతులు సమర్పించినా పట్టించుకునేవారు దిక్కు లేదు. సగానికిపైగా కాలనీల్లో పైపులైన్లు లేక పోవడంతో స్థానికులు నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఎమ్మిగనూరులో 23 వేల నివాసాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.4.50 కోట్లు ఇంటి పన్నులు రూపంలో వసూలు చేస్తున్నారు.

రూ.146 కోట్లతో నీటి పథకం మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ.146 కోట్లతో నీటి పథకం మంజూరు చేసింది. పట్టణంలో దాదాపు 90 కి.మీ. మేర పైపులైన్ చేపట్టాలని నిర్ణయించారు. కానీ వైకాపా ప్రభుత్వ హయంలో పనులు కాక పోవడంతో శివారు ప్రాంతాల ప్రజలకు శుద్ధజల నీరు కరవైంది. కూటమి ప్రభుత్వం చొరవ చూపి అసంపూర్తిగా ఉన్న నీటి పథకాన్ని త్వరగా పూర్తి చేసి పట్టణ ప్రజలకు దాహార్తి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మొత్తం జనాభా: 1.23 లక్షలు
వార్డులు: 34
శివారు ప్రాంతాల్లో జనాభా: 40 వేలు
ప్రస్తుతం మొత్తం ఇళ్లు: 23 వేలు
పట్టణంలో ఉన్న కుళాయిలు: 15 వేలు
రోజు విడుదల చేస్తున్నది: 1.2 ఎంఎల్‌డీ
శివారు ప్రాంతాలు: సాయిగణేశ్ కాలనీ, వెంకటసాయి, క్లబ్‌ఏరియా. అయ్యప్ప స్వామి గుడి ప్రాంతం, సాయినగర్, మునెప్పనగర్, పంపన్నగౌడ్ కాలనీ, రాధాకృష్ణ కాలనీ, మైనారిటీ కాలనీ, మహబూబ్‌నగర్, టీబీపీ వెనుక కాలనీ, సంజీవ్‌నగర్, శివన్నగర్ ప్రాంతాల్లో పైపులైన్లు లేవు.

తాగునీటి వసతి కల్పిస్తాం

– గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీటి పైపులైన్లు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు తీసుకుంటాం. పైపులైన్లు ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేసి ప్రజలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చే విధంగా చూస్తాం.

ప్రతి రోజూ రూ.20 ఖర్చు

–విశాలాక్షి సాయిగణేష్ కాలనీ



మా కాలనీలో పైపులైన్లు లేక పోవడంతో తాగునీటి వసతి కల్పించలేదు. చాలా సార్లు నీటి కోసం అధికారులకు విన్నవించాం. ప్రైవేటు శుద్ధజల కేంద్రం నుంచి ఆటో ద్వారా వచ్చే నీటి డబ్బాలను కొంటున్నాం. డబ్బా నీటి కోసం రోజుకు రూ.20 ఖర్చువుతోంది.

కాళ్లు అరిగేలా తిరిగాం

–హరినాథ్, కాలనీవాసి



ఇంటి పన్ను కింద రూ.6 వేలు చెల్లిస్తున్నా. తాగునీరు లేక పోవడంతో గతంలో అధికారులు చుట్టూ తిరిగి పైపులైన్ వేయాలని కోరాం. అదిగో ఇదిగో అని చెప్పి వదిలేశారు. మంచి నీరు కోసం నెలకు కనీసం రూ.వెయ్యి ఖర్చు చేస్తున్నాం.

ఏపీ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నెల్లూరులోని ధనలక్ష్మీపురం కల్పనా రెసిడెన్సీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. సుదీర్ఘ చర్చల అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షునిగా కర్నూలు జిల్లాకు చెందిన డబ్ల్యూ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా చేజర్ల సుధాకర్‌రావు (నెల్లూరు), గౌరవ అధ్యక్షునిగా భాను మూర్తి(గుంటూరు), కోశాధికారిగా ఎన్.హరిప్రసాద్(నెల్లూరు), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.జయప్రకాశ్(కడప), రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎస్‌డీ బేగం (విశాఖపట్నం) ఎన్నికయ్యారు.

మానసికోల్లాసానికి క్రీడలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్, న్యూసుటుడే: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం సి.బెళగల్ గురుకుల విద్యాలయంలో రాష్ట్ర స్థాయి షూటింగు బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 18 జిల్లాల జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో భూపతయ్య, పాఠశాల ప్రిన్సిపల్ బలరాము తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం

సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో నిధులు లేమితో మినీ స్టేడియం నిర్మాణం నోచుకో లేదని క్రీడాకారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. డీఎస్‌డీవో భూపతయ్య, తెదేపా మండల మాజీ కన్వీనరు బి.చిన్నతిమ్మప్ప, అమర్, ధనుంజయ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.చంద్రశేఖర్, మైనారిటీ నాయకుడు గౌసు తదితరులు పాల్గొన్నారు.

మూసుకున్న రోడ్డు..ప్రయాణికుల పాట్లు



మండలంలోని మేకడోన, కల్లుకుంట రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కల్లుకుంట గ్రామం నుంచి ద్విచక్ర వాహనదారులు, ఆటో చోదకులు నిత్యం ఈ రహదారిపై ఆదోనికి వెళ్తుంటారు. ఇటీవల ఎదురెదురుగా వచ్చే రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ముళ్ల పొదల సమస్యను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పెద్దకడబూరు**

అడుగు వేయాలంటే అడుసు తొక్కాల్సిందే



కోడుమూరు గొల్లవీధి నుంచి కృష్ణుడి ఆలయం వరకు రహదారి అంతా బురద మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిదారి గుంతలు పడి అపరిశుభ్రంగా మారింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి వెంట బీసీ కాలనీ, ఎస్సీ కాలనీకి, శాంతి నగర్‌కు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం**

దారంతా గుంతలు.. ఇరుక్కున్న వాహనాలు



మండలంలోని సాతనూరు, తుంబిగనూరు గ్రామాల మధ్య ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. ఆదివారం సాతనూరు-తుంబిగనూరు రోడ్డుపై బండలను తరలించే ఓ ట్రాక్టరు గుంతలో ఇరుక్కుంది. గంట పాటు ట్రాక్టర్ ముందుకు కదలకపోవడంతో రోడ్డుపై వాహనాలు బారులు తీరాయి. స్థానికులు పొక్లెయిన్ సహయంతో ట్రాక్టర్‌ను బయటకు లాగారు. ఈ రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా ఉందని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు వేయించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కోసిగి**

8న రైతులకు శిక్షణ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో అక్టోబరు 8న రబీలో శనగ, కుసుమ, జొన్న తదితర పంటలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఆనాటి గుర్తులు నెమరువేసుకున్నారు.

నేడు గోనెగండ్లలో ఎమ్మెల్యే పర్యటన

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు తెదేపా మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్ ఆదివారం తెలిపారు. గోనెగండ్లలో జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. అలాగే రైతులకు రాయితీపై శనగ విత్తనాల పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

దేవాలయాల పవిత్రతను కాపాడాలి


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాలయాల్లో అన్యమత ప్రచారాలు చేయవద్దని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వరస్వామికి రథోత్సవం నిర్వహించారు. గీతానగర్ నుంచి సోమప్ప కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. దేశంలో హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించాలన్నారు. దేవాలయాల్లో అన్యమత వ్యక్తులు దుకాణాలు కేటాయించవద్దన్నారు. తిరుమల పవిత్రను కాపాడాలని కోరారు. వెంకటసాయి దేవాలయం ధర్మకర్త శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు దీక్ష విరమించం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కల్లుకుంటకు చెందిన గోవిందమ్మ ఎమ్మిగనూరులో ఐదో రోజు దీక్ష చేపట్టారు. బాధితురాలు దీక్షను విరమించాలని సీఐ మధుసూదన్‌రెడ్డి కోరారు. ప్రజా సంఘాల నాయకులు మాత్రం మహిళకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించేది లేదని పేర్కొన్నారు. బాధితురాలికి తాము అండాగా ఉంటామన్నారు. ప్రజా సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, అమరేష్, నరసన్న, బతకమ్మ, ఈరన్న పాల్గొన్నారు.

ఘనంగా మాబు సుభాన్ దర్గా ప్రారంభం


వస్త్రాలు తీసుకొస్తున్న తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి తదితరులు

కోసిగి, న్యూస్‌టుడే: ముస్లిం సోదరులకు తెదేపా అండగా ఉంటుందని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కోసిగి మండలం పరిధిలోని దొడ్డిబెళగల్ గ్రామంలో నూతన దర్గా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దర్గా నిర్వాహకులు ఆయనకు పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు భరద్వాజ్ శెట్టి, నాయకులు రవితేజ శెట్టి, విజయరామిరెడ్డి, నర్సారెడ్డి, వీరారెడ్డి, పంపాపతి, నరసింహులు, రాముడు, చంద్ర, సల్మాన్ రాజ్, సిద్ధప్పగౌడ్ పాల్గొన్నారు.


గోనెగండ్ల: కైరవాడిలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకొంటున్న భక్తులు


ఎమ్మిగనూరు: సోగనూరు రోడ్డులోని జమ్ములమ్మదేవి..


ఎమ్మిగనూరు: గుడేకల్లులో దుర్గాదేవి అలంకరణలో..


కోడుమూరు గ్రామీణం: రామాలయంలో త్రిపుర సుందరిగా..


గూడూరు గ్రామీణం: కె.నాగలాపురంలో లలిత త్రిపుర సుందరిదేవిగా..

లలితా త్రిపుర సుందరి నమోస్తుతే


మంత్రాలయం: వారాహిదేవి అవతారంలో మారికాంబ దుర్గాదేవి


మంత్రాలయం గ్రామీణం: ఉప్పరహాల్‌లో లలితా త్రిపుర సుందరీదేవిగా గ్రామదేవత


ఎమ్మిగనూరు వ్యవసాయం: చేనేత మైదానంలో లలితదేవి అలంకరణలో అమ్మవారు


ఎమ్మిగనూరు వ్యవసాయం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో మధుర మీనాక్షి అలంకరణలో..


మంత్రాలయం: గాజులతో, పుష్పాలతో విశేషంగా దర్శనమిస్తున్న గ్రామ దేవత మంచాలమ్మ


సి.బెళగల్: అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో శరన్నవరాత్రులు పురస్కరించుకొని అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. –న్యూస్‌టుడే బృందం


మంత్రాలయం గ్రామీణం: కౌతాళం చౌడేశ్వరీదేవి ఆలయంలో

ప్రారంభించారు.. మధ్యలో వదిలేశారు

పిల్లర్ల దశలోనే నిలిచిన గోరంట్ల వంతెన

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గతంలో జగన్ పాదయాత్ర చేసిన సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే గోరంట్ల వంతెనను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. 2019లో గద్దెనెక్కిన జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని వదిలేశారు. ప్రజలను మోసం చేసేందుకు 2024 ఎన్నికలు ముందు మళ్లీ పనులు మొదలు పెట్టారు. అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేసి వదిలేశారు. 15శాతం పనులు కుడా గుత్తేదారు పూర్తి చేయలేదు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు అడ్రస్ లేకుండా పోయారు. కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాలకు చెందిన గ్రామ ప్రజలు దశబ్దాల కళ కళగానే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం చొరవ చూపి వంతెనను నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మధ్యలో నిలిచిపోయిన పిల్లర్ల నిర్మాణ పనులు

15 గ్రామాల ప్రజలకు అవస్థలు

కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు కొన్ని దశబ్దాలుగా హంద్రీలోనే రాకపోకలు సాగిస్తున్నారు. గోరంట్ల హై లెవల్ వంతెన ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు నాయకులు హామీలు ఇచ్చి ఆ తరువాత పట్టించుకోకపోవడంతో దాదాపు 15 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. 2023 సంవత్సరంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శిలాఫలకం ప్రారంభించి పనులకు శ్రీకారం చుట్టారు. ఏఐబీ నిధులు రూ.21 కోట్లతో గోరంట్ల హై లెవల్ వంతెనతో పాటు కొత్తపల్లి వరకు తారు రోడ్డు వేయాల్సి ఉంది. ఆరంభ శూరత్వం పాటిస్తూ ఐదారు నెలలు పనులు చేశారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు యంత్రాలతో సహా మధ్యలో వదిలేసి వెళ్లిపోయారు. వంతెన పనులు నిలిచిపోవడంతో ప్రజలు అప్పటి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు రూ.3 కోట్ల వరకు పనులు చేసినట్లు సమాచారం. పిల్లర్ల స్థాయిలోనే పనులు నిలిచిపోవడంతో గోరంట్ల, కొత్తపల్లి, ఎర్రగుడి, ఎర్రబాడు, రామకృష్ణాపురం, మన్నెగుంట తదితర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.

వ్యాపారానికి ఇబ్బంది

–ఎల్లకృష్ణ, ఎర్రగుడి



కోడుమూరులో ఉల్లి గడ్డలు, శనగల వ్యాపారం కోసం రోజూ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై తిరుగుతాను. నదికి వర్షం, వరద నీరు వస్తే వెళ్లడానికి ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీంతో వ్యాపారం దెబ్బతింటుంది. నీళ్లలో తరచు రాకపోకలు సాగించడంతో వాహనం మరమ్మతులకు గురవుతుంది.

అవతలి వైపు పొలం

–శివశంకర్, గోరంట్ల



గోరంట్లలో చాలా మంది రైతుల పొలాలు హంద్రీకి అవతలి వైపు ఉన్నాయి. నాకు 10 ఎకరాలు ఉంది. వర్ష కాలంలో నదికి నీళ్లు వచ్చినపుడు పొలానికి వెళ్లడానికి అవకాశం ఉండదు. వర్షం నీరు పంట పొలాల్లోనే నిలిచి దెబ్బతింటున్నాయి. వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.

కార్యకర్త మృతికి సంతాపం

సి.బెళగల్, న్యూసుటుడే: ముడుమాల గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు మండల మాజీ కన్వీనరు యన్.రాధాకృష్ణరెడ్డి(70) మృతి చెందారు. కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. తెదేపా మండల కన్వీనర్‌గా, కర్నూలు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, రైతు సంఘం నాయకుడిగా పదవులు చేపట్టారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ఎద్దుల బండిని ఢీకొట్టిన కర్ణాటక బస్సు

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: ఎద్దుల బండిని కర్ణాటక బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలు కాగా రెండు ఎద్దులకు తీవ్ర గాయాలయ్యాయి. మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం, చెట్నిహళ్లి గ్రామాల మధ్యలో ఆంజనేయస్వామి ఆలయం దగ్గర ఆదివారం ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈడిగ వెంకటేశ్, ఈడిగ నాయుడు ఆదివారం ఎద్దుల బండిపై పొలం నుంచి ఆముదాలు సంచులు వేసుకుని మాధవరం వస్తుండగా మంత్రాలయం నుంచి రాయచూరు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది.

ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయానికి చెందిన దుళ్లయ్య ఆదివారం ఉదయం పొలంలో నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కల్లుదేవకుంట గ్రామానికి చెందిన ఆనంద్ ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో దుళ్లయ్య స్వల్ప గాయాల పాలయ్యారు. ఫిర్యాదు మేరకు ఆనంద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ పెద్దయ్య తెలిపారు.

నిలిచిన ఏటీఎం సేవలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలో ఎస్బీఐ బ్యాంకు దగ్గర ఏర్పాటు చేసిన ఏటీఎం సేవలు మూడు రోజులుగా నిలిచిపోయాయి. ఏటీఎంలో డబ్బులు అందుబాటులో లేకపోవడంతో ఆర్థికలావాదేవీలు నిలిచిపోయాయి. దేవనకొండ, ఆస్పరి మండలాల గ్రామస్థులు కూడా గోనెగండ్ల ఏటీఎం వద్దకు వస్తారు. దసరా సందర్భంగా ఏటీఎం యంత్రాల సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గోనెగండ్లలో ఉన్న ప్రైవేటు బ్యాంకు ఏటీఎం సేవలు కూడా అందుబాటులో లేవు. దీంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

పల్లె కబుర్లు

సి.బెళగల్, న్యూసుటుడే: పోలకల్ గ్రామంలో ప్రముఖ శైవ క్షేత్రం సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పురోహితుడు రామయ్య ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి ఆదివారం తెలిపారు.

సి.బెళగల్: సి.బెళగల్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఉపతహసీల్దారు పురుషోత్తం ఆదివారం తెలిపారు. గ్రామాల్లో ఏమైన సమస్యలు ఉంటే వినతులు ఇచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

సి.బెళగల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మిథున్‌కుమారు రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయుష్ వైద్యాధికారి ప్రసాదరెడ్డి ఆదివారం తెలిపారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పెద్దకడబూరు మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. గత 10 రోజుల నుంచి మండలంలో వర్షం లేక పత్తి, మిరప పంటలు వాడుముఖం పట్టాయి. మండలంలో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పత్తి, మిరప సాగు చేశారు.

తారాపురం: గ్రామంలో గత ఐదు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయినట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. నీటి సరఫరా విభాగం సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామంలో ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో గిడ్డాంజినేయస్వామి ఆలయం ఉండటంతో ఇక్కడికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. నీటి ఎద్దడితో భక్తులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామానికి నీటి సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.



ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.50 వేల విరాళం

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణం శరీన్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శివాలయ నిర్మాణం చేపట్టారు. ఆలయానికి ధ్వజస్తంభం ఏర్పాటుకు యు.కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. ఆదివారం వారు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగమల్లేటి సమక్షంలో పూజారి హరికిశోర్ శర్మకు నగదును అందించారు.

నగదు అందజేస్తున్న యు.కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

వైద్యుల సంఖ్య పెరగాలి

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ఆటో ఇమ్యూనిటీ సమస్యలు పెరుగుతున్నాయని, ఇందుకు సంబంధించిన వైద్యుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని డా.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కర్నూలు వైద్య కళాశాల, హైదరాబాద్ రుమటాలజీ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కర్నూలులో రుమటాలజీ సీఎంఈ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.సృజన పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85000 05408
ఎమ్మిగనూరు : 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: **సమస్య:** కల్లూరు పట్టణం 31వ వార్డు పద్మావతి నగర్‌లో మురుగు కాలువలను శుభ్రం చేయాలి. - స్థానికులు
సమస్య: కల్లూరు చెన్నమ్మ కూడలి పైవంతెన కింద అండర్‌పాస్ రహదారి అధ్వానంగా మారింది. మరమ్మతులు చేయించగలరు. - మహేశ్
సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. - నగర పాలక అధికారులు

సర్దార్ నాగప్ప చిరస్మరణీయుడు

కర్నూలు క్రీడలు, గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ నాగప్ప చిరస్మరణీయుడని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పలు సంఘాల నాయకులు అన్నారు. నగరంలోని పాతబస్తీలో కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అంబేడ్కర్ కూడలి వద్ద సర్దార్ నాగప్ప జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయుడు దామోదరం రాధాకృష్ణ, బలిజ సంఘం నేత సుబ్బరాయుడు, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, విశ్రాంత పోలీస్ అధికారి జాన్ పాల్గొన్నారు. కర్నూలు ఆసుపత్రికి సర్దార్ నాగప్ప పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. నాగశేషయ్య, సర్దార్ బుచ్చిబాబు, సర్దార్ ఉమాదేవి పాల్గొన్నారు.



సర్దార్ నాగప్ప ఫ్లెక్సీకి నివాళి అర్పిస్తున్న నాయకులు

దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు దసరా కానుకగా ఐఆర్ ప్రకటించాలని ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ పీఆర్సీ విషయంలో వైకాపా ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. 12వ పీఆర్సీ రివిజన్ కమిషన్ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సమస్య పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

నగరానికి దూరం.. అభివృద్ధి శూన్యం

శివారు కాలనీల్లో మౌలిక వసతులు కరవు

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు నగర శివారులోని కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. నగరం రోజు రోజుకు విస్తరిస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు మెరుగుపడటం లేదు. నంద్యాల చెక్‌పోస్టు, జొహరాపురం, సంతోష్‌నగర్ సమీపంలోని కాలనీలు, స్టాంటన్‌పురం, మామిదాలపాడు, మునగాలపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం, పందిపాడులో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. నగర శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో దాదాపు 2 లక్షల వరకు జనాభా ఉంటుంది. ఏటా వీరి నుంచి నగర పాలకకు రూ.కోట్లలో పన్నులు వసూలు చేస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



రాజీవ్‌గృహ కల్ప సముదాయం సమీపంలో వ్యర్థాలు

ఎక్కడ పడితే అక్కడే చెత్త

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు నగర శివారులోని పెద్దపాడు రహదారిలో రాజీవ్ గృహకల్ప సముదాయం ఉంది. ఇక్కడ సుమారు 1,500 మంది కిపైగా జనాభా నివసిస్తున్నారు. అయితే పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడపడితే అక్కడే వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కాల్వల్లో మురుగు ముందుకు కదలడం లేదు. తాగునీటి సమస్య సైతం వేధిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

ఇళ్ల మధ్య మురుగుకుంటలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కల్లూరు కాలనీలు రెండు దశాబ్దాలు గడిచినా అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి. వీకర్ సెక్షన్ కాలనీకి సమీపంలోని కాలనీల్లో నేటికీ మట్టి దారులే దర్శనమిస్తున్నాయి. మురుగు కాల్వలు లేవు. వేలాది జనాభా నివాసముండే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2002లో కల్లూరు కాలనీలు నగర పాలక సంస్థలో విలీనమైనప్పటికీ తాగునీరు రెండు రోజులకొకసారి, అదీ కూడా శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారు. అరకొరగా అర గంట మాత్రమే వస్తున్నాయి. దీంతో కాలనీవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కాలనీల్లో ఇప్పటికీ మట్టి దారులే ఉన్నాయి. ఇళ్లల్లో నుంచి మురుగు బయటకు వెళ్లేందుకు కాల్వలు నిర్మించకపోవడంతో బయట కుంటలుగా మారాయి. వర్షాకాలంలో ఆయా కుంటల్లో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చెత్త, చెదారం, ప్లాస్టిక్ తొలగించడం లేదు. వీధిదీపాలు వెలగక రోజుల తరబడి చీకట్లో ఉంటున్నారు. 15 ఏళ్లుగా ఎల్కూరు బంగ్లా సమీపంలో కాలనీలు సీసీ రోడ్లకు నోచుకోలేదు. శాంతినగర్‌లో డ్రైనేజీ కాల్వల నిర్మాణం లేక ఇళ్ల మధ్య మురుగుకుంటలుగా మారాయి. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అటు ప్రజాప్రతినిధులు, ఇటు నగర పాలక అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



శాంతినగర్ కాలనీలో ఇళ్ల మధ్యలో మురుగుకుంట



ఇక్కట్లలో నంద్యాల రోడ్డు కాలనీవాసులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని శివారు కాలనీల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు, కాల్వల నిర్మాణాలు నత్తనడకన సాగుతుండటంతో అవస్థలు పడుతున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో అంతర్గత రహదారులు బురదగా మారడంతో బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. నంద్యాల రోడ్డును ఆనుకొని ఉన్న ఎస్సీఐ కాలనీ-2, పార్థసారథి నగర్, శ్రీశైలం ఎండోమెంట్ కాలనీ, రామచంద్రనగర్, దిన్నెదేవరపాడు రహదారి, సోమప్ప కాలనీల్లో పరిస్థితి దయనీయంగా మారింది. ఇళ్ల ముందు వర్షం నీరు నిలవడం, ముళ్లపొదల మధ్య నీరు నిలిచి పాచి పట్టి దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ 5 వేల మంది వరకు నివసిస్తున్నారు.

యూబీఐ సిబ్బందికి క్రికెట్ టోర్నమెంట్

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కర్నూలు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఆ బ్యాంకు



పాల్గొన్న యూబీఐ అధికారులు, సిబ్బంది

సిబ్బందికి నగర శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ప్రాంతీయ కార్యాలయ అధికారి నరసింహారావు మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, ఆనంద్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న యోగాసన పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: నగర శివారులోని ఇండస్ ఉన్నత పాఠశాల మైదానంలో ఐదో రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు కొనసాగుతున్నాయి. పోటీలను ఆదివారం ఏపీఎస్పీ పటాలం సహాయ కమాండెంట్ ఎస్. మహబూబ్ బాషా క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. యోగాతో ఆరోగ్యవంతమైన జీవితంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగాసన సంఘం రాష్ట్ర కార్యదర్శి రాధిక, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు శివరాజ్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.



యోగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మహబూబ్ బాషా



కర్నూలు బి.క్యాంపు: సి.క్యాంపు సెంటర్‌లో గణపతి ఆలయంలో సంగీత కచేరీ చేస్తున్న కళాకారులు



కర్నూలు బి.క్యాంపు: బుధవారపేటలో కనకదుర్గమ్మ ఆలయంలో లక్ష్మీవ్రతంలో మహిళలు



కర్నూలు బి.క్యాంపు: భరతమాత ఆలయంలో హోమంలో భక్తులు



కర్నూలు బి.క్యాంపు: రాజరాజేశ్వరీదేవి ఆలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



కర్నూలు ఆధ్యాత్మికం: సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు

అమ్మా భవాని.. ఓంకార రూపిణి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం హోమాలు, వ్రతాలు, సాయంత్రం సంగీత కచేరీ, చిన్నారులతో నృత్య ప్రదర్శనలు, మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం, కర్నూలు బి.క్యాంపు, కల్లూరు గ్రామీణం



కర్నూలు ఆధ్యాత్మికం: సూర్యనారాయణ దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా మహాగౌరీ అమ్మవారు



కర్నూలు ఆధ్యాత్మికం: పాతబస్తీ నిమిషాంబ ఆలయంలో అలంకరణ



కర్నూలు ఆధ్యాత్మికం: పాతబస్తీలో లలితా పీఠం అమ్మవారు



కర్నూలు ఆధ్యాత్మికం: గోదాగోకులంలో గజలక్ష్మి అలంకరణలో ఆండాళ్ అమ్మవారు



కర్నూలు ఆధ్యాత్మికం: పాతబస్తీ చిన్నఅమ్మవారిశాలలో అన్నపూర్ణ అవతారంలో కన్యకాపరమేశ్వరి



కల్లూరు గ్రామీణం: కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

రౌడీషీటర్ సోదరులపై ఫిర్యాదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని పాతబస్తీ ఖడక్‌పురాకు చెందిన ఓ మహిళ ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్ సోదరులపై ఫిర్యాదు చేశారు. తాను 8 నెలల గర్భిణి అని, ఈ నెల 5న అర్ధరాత్రి సమయంలో రౌడీషీటర్ సోదరులు, మరో వ్యక్తి కలిసి తన ఇంటికి వచ్చి దాడి చేసి గాయపర్చడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందానన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సెప్టెంబరు 21న రాత్రి పాతబస్తీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంగతి విదితమే. పరస్పరం ఫిర్యాదు మేరకు పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఓ వర్గానికి చెందిన నిందితుడి భార్య ప్రత్యర్థులపై ఆరోపణ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ జూనియర్ న్యాయవాది మృతి

కర్నూలు నేరవిభాగం, న్యాయవిభాగం, న్యూస్‌టుడే: డోన్‌లోని తారకరామ నగర్‌కు చెందిన జూనియర్ న్యాయవాది యు.బాలవడ్డీ రాజు (25) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన ఈ నెల 4న కర్నూలు నుంచి డోన్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కర్నూలు మండలం వెంగన్నబావి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న హోటల్ నిర్వాహకురాలు విజయలక్ష్మిని ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడ్డారు. తలకు గాయం కావడంతో బాలవడ్డీరాజు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కర్నూలు తాలుకా అర్బన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాలవడ్డీ రాజు మృతిపై జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు సంతాపం తెలియజేశారు.

నేర సమాచారం

తల్లీకుమారుడిపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని శరీన్‌నగర్‌కు చెందిన చిన్నమద్దిలేటి, ఆయన తల్లిపై కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. అదనపు కట్నం కోసం తన భర్త, అత్త మానసికంగా, శారీరకంగా వేధిస్తూ గాయపరిచినట్లు చిన్నమద్దిలేటి భార్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

తెలుగు తోటలో సాహితీ సదస్సు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని మద్దూరు నగర్ పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బనగానపల్లికి చెందిన అధ్యాపకుడు డా.కె.బడేసాహెబ్‌ను సన్మానించారు. అనంతరం దివంగత ముచ్చుకోట వెంకటరామయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర, నవ్యాంధ్ర రచయిత సంఘం కార్యదర్శి డాక్టర్ పార్వతి, ఎస్ఆర్‌కే శర్మ, కరివేన బ్రాహ్మణ సంఘం ప్రతినిధి మనోహర్‌రావు, హరిశ్చంద్రా రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

టీజీవీ కళా క్షేత్రంలో ఆదివారం కర్నూలుకు చెందిన కవి జి.వెంకటకృష్ణ రచించిన 'రవ్వల సడి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్, రచయితలు సుబాషిణి, ఆవుల చక్రపాణి, ఇనాయతుల్లా, పార్వతయ్య, ఏవీరెడ్డి, సీఐ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



బడే సాహెబ్‌ను సన్మానిస్తున్న కల్కూర, శర్మ, పార్వతి





అడుగేయలేనంత అడుసు..
వేయాలి గరుసు

సుంకేసుల మార్గంలో జి.సింగవరం ప్రాంతంలో రహదారంతా వర్షానికి బురదమయంగా మారింది. వాహనాలు నడిపే వీల్లేకుండా పోయింది. దీంతో వాహనదారులు, గ్రామస్థులు బురదలో వాహనాలను వదిలి నడుచుకుంటూ వెళ్తున్నారు. రహదారిపై వర్షం నీరు నిలవడంతో గుంతల్లో పడిపోయి పలువురు గాయాలపాలయ్యారని, అధికారులు స్పందించి కనీసం గరుసు వేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– ఈనాడు, కర్నూలు

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పాత నగరంలోని 8వ వార్డు పరిధిలో హంద్రీ నదిలో పూడిక తీత పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గురుశేఖర్, షరీఫ్ కోరారు. వర్షం పడిన సమయంలో ఈ ప్రాంతంలో హంద్రీ నుంచి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం పెద్ద పడఖాన నూతన కార్యదర్శిగా రవికుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

☛ 8న ఆశా డే సందర్భంగా ఆశా కార్మికుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ఆశా కార్మికులు నిరసనలు చేపట్టాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జె.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి కోరారు.

☛ రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలు తగ్గించాలని సీపీఎం పాత నగరం నగర కార్యదర్శి రాజశేఖర్ డిమాండు చేశారు. నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని కోరుతూ ఆదివారం పాత నగరంలో నిరసన చేపట్టారు.

న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని గుట్టపాడు సమీపంలో ఏర్పాటు చేస్తున్న జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమలో బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ఇళ్లకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప డిమాండు చేశారు. ఆదివారం వారు గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో భాగంగా ఓపెన్ బ్లాస్టింగ్ చేయడంతో ఇళ్లు బీటలు వారడంతోపాటు సమీప పొలాల్లో పెద్ద రాళ్లు పడినప్పటికీ పరిశ్రమ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇళ్లు నిర్మించుకున్న పేదలు నివసించేందుకు భయాందోళన చెందుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, సుధాకర్, నరసింహరాజు, జయన్న పాల్గొన్నారు.



గుట్టపాడులో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అథ్లెటిక్స్.. యువత అదుర్స్

☛ జాతీయ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన సీబీఎస్ఈ దక్షిణ మండలం అంతర్ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలుకు చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. లక్ష్య ఫౌండేషన్ శిక్షకురాలు హారిక ప్రోత్సాహంతో వారు ప్రస్తుతం జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారు.

లాంగ్‌జంప్.. జస్వికా భేష్

నేను సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నలు భారతి, శ్రీధర్. నాన్న నగరంలోని ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో అధ్యాపకుడు. క్రీడలపై ఆసక్తితో రెండేళ్ల నుంచి శిక్షకురాలు హారిక వద్ద ప్రత్యేక తర్ఫీదు పొందుతున్నాను. దక్షిణ మండలం పోటీల్లో స్వర్ణ పతకం సాధించాను. 2024 సెప్టెంబరు 17 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండల అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో లాంగ్‌జంప్‌లో, ట్రిపుల్‌లో బంగారు పతకం అందుకున్నా. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు వారణాసిలో జరిగే జాతీయ స్థాయి సీబీఎస్ఈ అథ్లెటిక్స్‌లో పాల్గొంటున్నాను. 400 మీటర్ల పరుగు, 400 మీటర్ల హర్డిల్స్‌లో రెండు స్వర్ణ పతకాలు అందుకున్నాను.



పరుగులో పసిడి మెరుపులు



నా పేరు దివెన్‌కుమార్. మేము కర్నూలులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో నివసిస్తున్నాం. మా అమ్మానాన్నలు హర్షిణి, లాజర్. అమ్మ కృష్ణగిరి మండలంలో ఆదర్శ పాఠశాలలో పీజీటీ ఆంగ్ల అధ్యాపకురాలిగా, నాన్న వ్యాపారం చేస్తున్నారు. లక్ష్య ఫౌండేషన్ ప్రోత్సాహంతో అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నాను. 2020 ఫిబ్రవరిలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర కేంద్రీయ విద్యాలయ క్రీడా పోటీల్లో హర్డిల్స్‌లో రజతం సాధించాను. జులైలో హైదరాబాద్‌లో నిర్వహించిన రీజనల్ స్పోర్ట్స్ మీట్‌లో అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగులో రజతం, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం అందుకున్నా. సెప్టెంబరులో గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ మీట్‌లో 400 మీటర్ల పరుగులో కాంస్య పతకం గెలిచారు. నవంబరులో లక్నోలో జరిగిన కేంద్రీయ విద్యాలయ జాతీయ స్థాయి పోటీల్లో 400 మీటర్ల పరుగు, హర్డిల్స్‌లో 4, 5 స్థానాల్లో నిలిచారు. 2024 జులై కేంద్రీయ విద్యాలయ స్పోర్ట్స్ మీట్‌లో 400, హర్డిల్స్‌లో బంగారు పతకం అందుకున్నారు. సెప్టెంబరు 17 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండల అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగులో స్వర్ణం, 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం సాధించారు. అక్టోబరు 6 నుంచి కేరళలోని తిరువనంతపురంలో జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం అందుకున్నాను.